ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
1
RNI No: APTEL/2023/87888
గురువారం
06 నవంబర్ 2025

ఏడాదిన్నరలోనే గంజాయి రహిత రాష్ట్రంగా మార్చాం:హోంమంత్రి అనిత

మంగళగిరి, నవంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్): ఏపీలో ఈగల్ వ్యవస్థను స్థాపించాక ఏడాదిన్నరలో జీరో గంజాయిగా మార్చామని హోంమంత్రి అనిత తెలిపారు. మంగళగిరిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే నినాదాన్ని స్కూల్ స్థాయిలోకి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. గతంలో గంజాయికి బానిసగా మారిన పిల్లలను చూసి తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారన్నారు.

యువత భవిష్యత్తుకు భరోసా కల్పించాలనే ఈగల్ వ్యవస్థను తీసుకొచ్చినట్లు వివరించారు. "డ్రగ్స్ వల్ల వచ్చే అనర్థాలు, కేసుల్లో ఇరుక్కుంటే వచ్చే నష్టాలేంటో అవగాహన కల్పిస్తున్నాం. యువత భవిష్యత్తుపై మాట్లాడే హక్కు జగన్కు లేదు. డ్రగ్స్ దందా చేసిన వాళ్లకు ఆయన ఒత్తాసు పలుకుతున్నారా? మాదకద్రవ కేసులో అడ్డంగా దొరికిన కొందారెడ్డి నేతృత్వంలో జగన్ శిక్షణ కార్యక్రమాలా? అతడిని పార్టీ నుంచి సస్పెండ్ చేయకుండా విద్యార్థులతో సమావేశాలా? 2019-24 మధ్య దేశంలో గంజాయి ఎక్కడ దొరికినా దాని మూలాలు ఏపీలో ఉన్నాయని చెప్పుకొనే పరిస్థితి. అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్ గా ఉన్న రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్ గా మార్చిన ఘనత జగన్ది. స్కూల్ పిల్లల బ్యాగ్లో కి కూడా దాన్ని చేర్చిన ఘనత ఆయనది. డ్రగ్స్, గంజాయిపై వైకాపా హయాంలో ఒక్క సమీక్ష అయినా చేశారా? కానీ సీఎం చంద్రబాబు దీని నిర్మూలనకు ఆరుగురు మంత్రులతో ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేశారు" అని అనిత తెలిపారు.

మాలేపాటి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి నారా లోకేశ్

కావలి, నవంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్): ఇటీవల మృతి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు కుటుంబాన్ని మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంతకుముందు నెల్లూరు జిల్లా కావలి చేరుకున్న లోకేశ్కు ఎమ్మెల్యే వెంకటకృష్ణ రెడ్డి, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ముసునూరు టోల్ ప్లాజా నుంచి దగదర్తి వరకు ర్యాలీగా వెళ్లారు. మాలేపాటి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. కార్యకర్తలకు తెదేపా ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. "కార్యకర్తల కోసం పార్టీ తరపున రూ.135 కోట్ల సంక్షేమ నిధిని ఏర్పాటు చేశాం. ఫ్యాక్షన్ అడుగుజాడల్లో వెళ్లకుండా పిల్లల్ని చదివిస్తున్నాం. క్రమశిక్షణకు తెదేపా మారుపేరు. నేను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి సుబ్బానాయుడుతో మంచి పరిచయం ఉంది. రాష్ట్రంలో బలమైన నాయకుడిని కోల్పోయాం. 2019 నుంచి 2024 వరకు నాటి నాయకులపై మాలేపాటి యుద్ధం చేశారు. యువగళం పాదయాత్రలో నాతో ఐదురోజుల పాటు నడిచారు" అంటూ ఆయనతో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

మహిళా డీఎస్పీలు మరో తరానికి ఆదర్శం కావాలి:డీజీపీ

హైదరాబాద్, నవంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్): పోలీస్గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే ప్రజల హృదయాలు గెలవాలని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు. మహిళా డీఎస్పీలు వచ్చే తరానికి ఆదర్శంగా నిలవాలన్నారు. గ్రూప్ -1 ద్వారా ఎంపికైన డీఎస్పీలకు హైదరాబాద్ పోలీస్ అకాడమీలో శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డీజీపీ హాజరయ్యారు. మొత్తం 112 మందికి శిక్షణ ప్రారంభిస్తున్నామని, ఇప్పటి వరకు ఇదే అతిపెద్ద బ్యాచ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్ కూడా పాల్గొన్నారు.

ఇలా వైరల్ అవుతాననుకోలేదు:రాహుల్ గాంధీ ప్రెస్‌మీట్ పై బ్రెజిల్ మోడల్

నవంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్): హరియాణాలో భారీఎత్తున ఓట్ల చోరీ జరిగిందంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బ్రెజిల్ కు చెందిన ఓ మోడల్ ఫొటోను ప్రదర్శించడం చర్చనీయాంశమైంది. ఆ మోడల్ ఫొటోతో నకిలీ ఓట్లు సృష్టించారంటూ రాహుల్ ఆరోపించారు. దీంతో ఆమె ఫొటో నెట్టింట తెగ వైరల్గా మారింది. ఆ ఫొటోలో ఉన్న మోడల్ పేరు లారిసా నెరీ. ఈ వార్తలపై ఆమె తాజాగా స్పందించారు. అది తన పాత ఫొటో అని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రెస్మీట్ తర్వాత నుంచి ఆ మోడల్ ఎవరా అని నెటిజన్లు తెగ సెర్చ్ చేశారు. ఈ క్రమంలోనే లారిసా తన ఇన్స్టా పేజీలో దీనిపై స్పందించారు. ఓట్ల చోరీ వార్తల్లో తన పేరు రావడం చూసి చాలా షాకయ్యానని తెలిపారు. చాలామంది తనకు ఫోన్లు చేస్తున్నారని, ఇంటర్వ్యూలు అడుగుతున్నారని తెలిపారు. ఇలా వైరల్ అవుతానని అనుకోలేదన్నారు. "అది నా పాత ఫొటో. 18-20 ఏళ్ల వయసులో తీసుకున్నది అనుకుంటా. స్టాక్ ఇమేజ్ ప్లాట్ఫామ్ నుంచి ఆ ఫొటోను కొనుగోలు చేసి ఉంటారనుకుంటా. నన్ను భారతీయురాలిగా పేర్కొంటూ స్కామ్లో భాగం చేశారు. ఇదేం పిచ్చితనం. ఎలాంటి ప్రపంచంలో మనం జీవిస్తున్నాం. భారత రాజకీయాలతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నేను బ్రెజిల్కు చెందిన డిజిటల్ ఇన్ఫ్లూయెన్సర్ను. ఇలాంటి వదంతులు రావడం చూసి నమ్మలేకపోయా. ఆ తర్వాత నుంచి నాకు చాలామంది ఫోన్లు చేస్తున్నారు. ఇంటర్వ్యూలు కావాలంటున్నారు. వారికి సమాధానం చెప్పలేకపోతున్నా" అని లారిసా వివరణ ఇచ్చారు. ఈ వీడియోను ఫ్యాక్టుకర్ మహమ్మద్ జుబేర్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. గత ఏడాది హరియాణాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 25 లక్షల నకిలీ ఓట్లు ఉన్నాయని, అందువల్లే భాజపా అధికారంలోకి వచ్చిందని రాహుల్ గాంధీ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే బ్రెజిల్ మోడల్ ఫొటోను ప్రదర్శించారు. ఆమె ఫొటోతో 22 నకిలీ ఓట్లు సృష్టించినా ఈసీఐ ఎందుకు కనిపెట్టలేకపోయిందని ప్రశ్నించారు.



జగన్ తీరు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు :మంత్రి సంధ్యారాణి

అమరావతి, నవంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్రానికి దాదాపు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల సాధనే లక్ష్యంగా భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నట్లు మంత్రి సంధ్యారాణి తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖ సదస్సు వల్ల ఉత్తరాంధ్రకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. రాష్ట్రానికి, ప్రజలకు మేలు జరుగుతుంటే కుట్రలతో అడ్డుకోవాలని చూస్తారా? అని ప్రశ్నించారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'రైతు పరామర్శ' పేరుతో జగన్ విన్యాసాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. జగన్ మాట్లాడేటప్పుడు వాస్తవ పరిస్థితులపై అవగాహన పెంచుకుంటే మంచిదని హితవు పలికారు.

నెల్లూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం.. 16 మందికి గాయాలు

ఉలవపాడు, నవంబర్ 6, (రిపబ్లిక్ న్యూస్): నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం మోచర్ల జాతీయ రహదారిపై ప్రమాదం చోటు చేసుకుంది. ఆటో-కారు ఢీ కొన్న ఘటనలో 16 మందికి గాయాలయ్యాయి. పెట్రోల్ బంకు నుంచి జాతీయ రహదారిపైకి వచ్చిన ఆటోను ఆ దిశగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ఆటోలోని 13 మంది, కారులోని ముగ్గురు గాయపడినట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను ఉలవపాడు, కావలి ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రులను కరేడు పంచాయతీ అలగాయిపాలెం ఎస్సీ కాలనీ వాసులుగా గుర్తించారు.

స్విమ్సూట్ కారణంగా.. ఆ స్టార్ హీరో సినిమాను రిజెక్ట్ చేశా: రవీనా టాండన్

స్విమ్సూట్ వేసుకోవడం ఇష్టం లేక స్టార్ హీరో సినిమాను రిజెక్ట్ చేసినట్లు బాలీవుడ్ నటి రవీనా టాండన్ తెలిపారు. తాను ఏ నిర్ణయాన్నైనా నిర్భయంగా చెబుతానని వెల్లడించారు. కెరీర్లో ఎదురైన సంఘటనల గురించి పంచుకున్నారు. "షారుక్ ఖాన్ హీరోగా 1993లో వచ్చిన 'డర్' సినిమాలో మొదట నాకే అవకాశం వచ్చింది. అయితే అందులో కొన్ని సన్నివేశాలు నాకు అసౌకర్యంగా అనిపించడంతో దానికి రిజెక్ట్ చేశాను. చివరకు ఆ పాత్ర జూహీచావ్లాకు వెళ్లింది. ఆ సినిమాలో షారుక్, జూహీ కెమిస్ట్రీ అందరినీ ఆకట్టుకుంది. నేను ఆ సినిమాను రిజెక్ట్ చేయడానికి కాస్ట్యూమ్స్ కూడా ఒక కారణం. అందులో కొన్ని సన్నివేశాలతో పాటు కాస్ట్యూమ్స్ కూడా నాకు నచ్చలేదు. స్విమ్సూట్ ధరించాలని చెప్పారు. నేను అందుకు అంగీకరించలేదు. అది చాలా చిన్న సన్నివేశం అయినప్పటికీ నేను నో చెప్పా""కరిష్మాకపూర్ తొలి సినిమా 'ప్రేమ ఖైదీ' ఆఫర్ కూడా నాకే వచ్చింది. అందులో ఒక సన్నివేశం నచ్చక వదులుకున్నాను. కెరీర్ ప్రారంభంలో చిన్ని చిన్న విషయాలకు కూడా సినిమాలు రిజెక్ట్ చేసేదాన్ని. నాకు నచ్చని వ్యక్తులతో నటించేదాన్ని కాదు. ఇప్పటికీ అదే పద్ధతి ఆచరిస్తున్నాను. ఏ విషయాన్నైనా భయం లేకుండా చెబుతాను" అని రవీనా చెప్పారు.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్

ప్రపంచకప్ విజయం వెనక అసలైన ఆర్కిటెక్టు వారే: అమోల్ మజుందార్

దాదాపు 47 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ భారత మహిళా జట్టు వన్డే ప్రపంచకప్ ను కైవసం చేసుకుంది. దీని వెనక క్రికెటర్ల కృషి ఎంత ఉందో.. ప్రధాన కోచ్ అమోల్ మజుందార్ శ్రమ కూడా అంత ఉంది. వరుసగా అపజయాలు ఎదురైనా సరే, జట్టులో ఏమాత్రం నిరుత్సాహం దరి చేరనీయకుండా ముందుండి నడిపించాడు. అయితే, భారత్ ప్రపంచకప్ విజేతగా నిలవడం వెనక అసలైన ఆర్కిటెక్టు మన క్రికెటర్లేనని అమోల్ వ్యాఖ్యానించాడు. ఆయన పీటీఐతో ప్రత్యేకంగా సంభాషించారు. "వరల్డ్ కప్ విజయం వెనక అసలైన ఆర్కిటెక్టులు క్రికెటర్లు, సహాయక సిబ్బందే. ప్రతిఒక్కరూ వారి కర్తవ్యాలను అద్భుతంగా నిర్వర్తించారు. ఇది వారికి చెందిన విజయం. టీమ్ ఇండియా తరపున ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయిన నేను క్రికెటర్గా 2014లో ఆటకు వీడ్కోలు పలికా. ఇప్పటికి 11 ఏళ్లు గడిచిపోయాయి. అదంతా గతం. ఇప్పుడీ వన్డే ప్రపంచకప్ విజయంతో భారత క్రీడారంగంలో మహిళలు సరికొత్త మైలురాయిని చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశం కావడం మా జట్టుకు గుర్తుండిపోయే క్షణాలు. నిరంతరం వెనకుండి ప్రోత్సహిస్తోన్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు" అని అమోల్ వెల్లడించాడు.

ఇది నా తొలి వరల్డ్ కప్: క్రాంతి గౌడ్

భారత విజయాల్లో పేస్ బౌలర్గా కీలక పాత్ర పోషించిన క్రాంతి గౌడ్ సంతోషం వ్యక్తంచేసింది. పీటీఐతో మాట్లాడుతూ.. "చాలా ఆనందంగా ఉంది. నాకు ఇది తొలి వన్డే ప్రపంచకప్. భారత్ వేదికగా జరిగిన ఈ మెగా టోర్నీ విజేతగా నిలవడం అద్భుతంగా ఉంది. జట్టులోని ప్రతిఒక్కరూ వెనకడుగు వేయకూడదని కృతనిశ్చయంతో పోరాడాం. కలిసికట్టుగా ఆడితే తప్పకుండా ట్రోఫీ గెలుస్తామని మాకు తెలుసు. అలాగే ఆడి ఛాంపియన్గా మారాం" అని క్రాంతి గౌడ్ తెలిపింది.

ఇంటి చిట్కాలు

మునగ ఆకుల్ని రోజూ తీసుకుంటే ధమనుల్లో పేరుకుపోయిన ఫలకం కరిగి గుండెకి మంచిది, ఎలా తీసుకోవాలంటే

మునగాకు కొన్నివేల సంవత్సరాల నుంచి వీటిని మనం వంటల్లో అనేక రకాలుగా వాడుతుంటాం. దీనిలోని గుణాల కారణంగా మనకి ఎన్నోసమస్యలు దూరమవుతాయి. దానికోసం ఎలా తీసుకోవాలి.. ఏయే సమస్యలు దూరమవుతాయో తెలుసుకోండి.

సాధారణంగా ఇళ్లలో మునగాక పప్పు, మునగాకు కారం, మునగపొడి .. ఇలా అనేక రకాలుగా మునగాకుల్ని వాడతాం. మునగాకుల్లో ఎన్నో అద్భుత గుణాలున్నాయి. మరీ ముఖ్యంగా ఆరోగ్యకరమైన యాంటీ ఆక్సిడెంట్స్, బయోయాక్టివ్ ప్లాంట్ కాంపౌండ్స్ కూడా ఉన్నాయి. వీటిని మనం ఏదో రకంగా తీసుకోవడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయి.మునగలో విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ప్రోటీన్, విటమిన్ బి6, విటమిన్ సి, ఐరన్, రిపోఫ్లేవిన్ బి2, విటమిన్, ఎ, మెగ్నీషియంలు ఉన్నాయి. ఇన్ని పోషకాలున్న మునగాకుతో టీ చేసి తాగితే ఎన్నో సమస్యలు దూరమవుతాయి. అవేంటో తెలుసుకోండి.

జీర్ణ వ్యవస్థని కాపాడేందుకు

మునగాకుల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఈ ఆకులతో టీ చేసుకుని తాగడం వల్ల మలబద్ధకం, ఉబ్బరం, గ్యాస్ వంటి జీర్ణ సమస్యల్ని దూరం చేసి జీర్ణ వ్యవస్థని చురుగ్గా పనిచేసేలా చేస్తుంది. ఈ ఆకులు ప్రేగు కదలికల్ని మెరుగ్గా చేసి మలబద్ధకాన్ని దూరం చేస్తుంది.

ఎలా తయారుచేయాలి

ఈ టీ తయారుచేసేందుకు మనం కొన్ని తాజా మునగ ఆకుల్ని తీసుకుని నీటిలో వేసి మరిగించాలి. 4 నుంచి 5 నిమిషాల పాటు మరిగిన తర్వాత ఆ నీటిని తాగాలి. దీనికోసం మీరు ఎండిన మునగాకుల్ని కూడా తీసుకోవచ్చు. లేదంటే మునగాకు పొడినైనా వాడొచ్చు.

బ్లడ్ షుగర్



మునగాకుల టీ తాగడం వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్ రెగ్యులేట్ అవుతాయి. ఈ ఆకులు గ్లూకోజ్ లెవల్స్ని తగ్గిస్తాయి. కాబట్టి, షుగర్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. రెగ్యులర్ టీలు తాగే బదులు ఇలాంటి హెర్బల్ టీలు తాగడం వల్ల చాలా వరకూ సమస్య కంట్రోల్ ఉంటుంది.

ఇమ్యూనిటీ

మునగాకుల్లో యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఇమ్యూన్ సిస్టమ్ బూస్ట్ అవుతుంది. ఇందులోని యాంటీ మైక్రోబయల్ గుణాల కారణంగా ఇన్ఫెక్షన్స్ దూరమై సీజన్ చేంజ్ అయినప్పుడు వచ్చే సీజనల్ ప్రాబ్లమ్స్ని దూరం చేస్తాయి. జలుబు, దగ్గు, ఫ్లూ వంటి సమస్యల్ని దూరం చేస్తుంది.

గుండె ఆరోగ్యం



మునగాకులోని గుణాల కారణంగా కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దీంతో పాటు బ్లడ్ ప్రెజర్ కూడా తగ్గుతుంది. మునగలోని గుణాలు ధమనుల్లో పేరుకుపోయిన కొవ్వు ఫలకాలని కరిగేలా చేస్తుంది. ఈ కారణంగా గుండెకి రక్త సరఫరా సరిగా జరుగుతుంది. గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. కాబట్టి, రెగ్యులర్గా ఈ టీని తాగండి.

డీటాక్స్



మునగాకుల్ని టీ చేసి తాగితే బాడీలో పేరుకుపోయిన టాక్సిన్స్ బయటికి వెళ్లిపోతాయి. మునగాకుల్లో డీటాక్సిఫై గుణాలు పుష్కలంగా ఉనాయి. ఇందులోని ఐరన్ బాడీకి కావాల్సిన ఐరన్ని అందిస్తుంది. కాబట్టి, రెగ్యులర్గా ఈ టీని తీసుకునే ప్రయత్నం చేయండి.